క్లుప్తంగా

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌కు సత్కారం

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు.కె గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న లొడగల శ్రీనివాసరావును సర్పంచ్ పైల దివ్య ఆధ్వర్యంలో గ్రామప్రజలు, వేతనదారులు ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామ పంచాయతీ ప్రజలకు నిత్యం పనులు కల్పిస్తూ.. అందరికీ సహాయకారిగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలి



సత్సంగంలో పాల్గొన్న ఆధ్యాత్మిక వేత్తలు

సరుబుజ్జిలి: ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని రొట్టవలస శ్రీరామానందాశ్రమం వ్యవస్థాపకులు తొత్తడి వెంకటరమణస్వామి తెలిపారు. ఆశ్రమం ఆవరణలో ఆదివారం సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. భగవంతుని ధ్యానంలో మానవులు ఎల్లప్పుడూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు రామారావు, జ్యోతి, రామకృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ..



గోవిందరావును పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

హిరమండలం: మండలంలోని చవితిసీది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.గోవిందరావు తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం చవితి సీది వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిటిజన్ ఫోరం ప్రతినిధులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి స్థానిక సిటిజన్ ఫోరం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు సిటిజన్ ఫోరం ప్రతినిధులు పుచ్చల విశ్వేశ్వరరావు, ముంగి విజయ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. కూరగాయల దుకాణాలన్నీ ఒకేచోటకు తీసుకురావాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు విశ్వేశ్వరరావు తెలిపారు.

ఘనంగా రామ మందిరం ప్రారంభోత్సవం



పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

సారవకోట: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో రామ మందిర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో గతంలో ఉన్న రామ మందిర స్థానంలో గ్రామస్తులు సుమారు రూ.20 లక్షలతో నూతన రామ మందిరాన్ని నిర్మించి ఈ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మందిరంలో విగ్రహాల ప్రతిష్ట, గోపుర ప్రతిష్ట కార్యక్రమాన్ని రుత్వికులు వెంకట రంగనాథ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్పదర్శనం, నిజరూప దర్శనం చేయించారు. మందిర ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం



రేణుఖేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి: నవ సమాజం నిర్మాణంలో ఉపాధ్యాయుడు కీలకమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దమడి గిరిజన గురుకుల జూనియర్ కళాశాల (బాలుర) ఆవరణలో విశ్రాంత ఉపాధ్యాయుడు కవిటి రేణుఖేశ్వరరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కళాశాల ఆవరణలో కళా వేదికను నిర్మించి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడిని ఎమ్మెల్యే, గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నిర్లక్ష్యం



పాతపట్నం మండల కేంద్రంలోని జాతీయ రహదారికి అనుకుని ఉన్న 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రహరీకి అనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలకు పొదులు అల్లుకున్నాయి. 12 కేవీ, 11 కేవీ వైర్లకు పొదలు అల్లుకుని ఉండడం వల్ల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్లుగా విద్యుత్తు అధికారులు దీనివైపు చూడకపోవడంతో పిచ్చి మొక్కలు, పొదులు ఏపుగా పెరిగిపోయాయి. దీనికి ఆనుకుని ప్రధాన జాతీయ రహదారి ఉండడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొదులను తొలగించాలని కోరుతున్నారు.

– పాతపట్నం

● బోర్డు ఉన్నచోటే చెత్తకుప్ప



మెళియాపుట్టి మండలంలోని మర్రిపాడు 'సి' గ్రామ పంచాయతీ జలక లింగుపురం గ్రామ రహదారి పక్కనే చెత్త వేయరాదు అనే హెచ్చరిక బోర్డును పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రజలు దీన్ని అస్సలు పట్టించుకోలేదు. హెచ్చరిక బోర్డు ఉన్న చోటే చెత్త వేస్తూ. అదే ప్రదేశంలో మల విసర్జన సైతం చేస్తున్నారు. జలకలింగుపురం గ్రామానికి వెళ్లే ముందు దుర్గంధ భరితంగా దర్శనమిస్తున్న పస్థితి కనిపిస్తుంది. చెత్తను నివాస ప్రదేశాలలో వేసి అక్కడి ప్రజలు రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని పలువురు గ్రామస్తులు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి

● చీరలే పంటకు రక్షణ



మెళియాపుట్టి మండలంలోని జలకలింగుపురంలో ఓ రైతు తన వంగ తోటకు చీరలతో కంచె వేశాడు. పశువుల నుంచి కాపాడటానికి ప్రతీ ఏడాది కూరగాలయల సాగుకు అయ్యే ఖర్చుతో పాటు.. కంచె వేయడానికి కూడా కొంతమేర వెచ్చించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో వినూత్నంగా ఆలోచించిన రైతు ఉమాపతి చీరలను రక్షణ కంచెగా వేసి పంటను కాపాడుకుంటున్నారు. తక్కువ ఖర్చుతోనే కంచె ఏర్పాటు కావడంతో కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలిగిందని రైతు అంటున్నారు. వంగ పంట రహదారికి పక్కనే ఉండటంతో రంగు, రంగుల చీరలతో వేసిన కంచె తోటను కాపాడుతూనే చూపరులను ఆకర్షిస్తుంది.

– మెళియాపుట్టి

శివారుకు సాగునీటి కష్టాలు

- ప్రమాదపుటంచున వంశధార ప్రధాన కాలువలు
- కిందకు ప్రవహించని సాగునీరు
- వంశధార కాలువ గట్లకు భద్రత కరువు



సుభద్రాపురం వద్ద కరిగిపోతున్న కాలువ గట్లు



ఏబీ రోడ్డులో జొన్నవలస వద్ద నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపుడెక్క

సరుబుజ్జిలి: శివారు ప్రాంత రైతులకు ప్రతి ఏడాది సాగునీటి కష్టాలు తప్పడం లేదు. సాగునీటి కాలువలకు సకాలంలో మరమ్మతులు చేయడంలేదు. పలుచోట్ల గట్లు కూడా కరిగిపోవడం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో సాగునీటికి అవస్థలు తప్పడం లేదు. ప్రతీ సెంటుకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు అనుసంధాన, పిల్ల కాలువల పనితీరు సక్రమంగా లేకపోవడంతో రైతన్నలకు కష్టాలు తప్పడంలేదు. వంశధార కుడి ప్రధాన కాలువ హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మండలాల వరకు 67 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించారు.

కాలువ నిండా గుర్రపు డెక్క...

బ్రిడ్జీలు, మలుపుల వద్ద గుర్రపుడెక్క పేరుకుపోయింది. కాలువ నిండా సాగునీరు వచ్చే సమయంలో గుర్రపుడెక్క ప్రభావం వల్ల నీటి ఒత్తిడి పెరిగి గట్లుకు గండ్లు పడే ప్రమాదముంది. గతంలో సరుబుజ్జిలి వద్ద కుడి ప్రధాన కాలువ గట్టుకు నీటి ప్రవాహ సమయంలో భారీ గండి పడింది.

పాడైన షట్టర్లు..

వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, పిల్ల కాలువల షట్టర్లు పని చేయకపోవడంతో సాగునీరు అధికంగా వచ్చే సమయంలో మళ్లించలేక వృథాగా విడిచిపెడుతున్నట్లు రైతులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో చుక్కనీటి కోసం నానా కష్టాలు పడుతున్నామన్నారు.

పర్యవేక్షణ లోపం...

ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభానికి కనీసం నెలరోజుల ముందుగా కూడా అధికారులు కాలువల పనితీరును పరిశీలించడంలేదని రైతులు ఆగ్రహిస్తున్నారు. నెలలో ఒక్కరోజు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం వల్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు.

కరిగిపోతున్న కాలువ గట్లు

వంశధార కాలువ గట్లు వర్షాలకు కరిగిపోయి సాధారణ పొలాల గట్లు మాదిరిగా దర్శనమిస్తున్నాయి. సాగునీరు ఒత్తిడితో ప్రవహించే ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించడంలేదు. సాగునీరు అధికంగా వచ్చే సమయంలో గండ్లుపడి పంటలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

షట్టర్లు బాగుచేయాలి



కాలువలపై షట్టర్లు, చెక్ డ్యామ్‌లు, కాజ్‌వేలు సక్రమంగా లేవు. షట్టర్లు ఏర్పాటు చేస్తే సాగునీటిని చెరువులకు మళ్లించి అత్యవసర పరిస్థితుల్లో వినియోగించవచ్చు.

– ఎల్.విశ్వేశ్వరరావు, రైతు, కొండవలస, సరుబుజ్జిలి

క్షేత్రస్థాయిలో పర్యటించాలి



వంశధార అధికారులు నెలలో ఒక్కసారికూడా మండల కేంద్రాలకు రావడంలేదు. మండల జనరల్ బాడీ సమావేశానికి తప్ప.. మిగిలిన సమయాల్లో కనిపించడంలేదు. క్షేత్రస్థాయి పర్యటనలు లేకపోవడం వల్ల సమస్యలు వారి దృష్టికి వెళ్లడంలేదు.

– పి.తవిటినాయుడు, రైతు, మర్రిపాడు, సరుబుజ్జిలి

పూడికతీత పనులు చేస్తున్నాం

కాలువలో ఇటీవల పూడికతీత పనులు చేపట్టాం. కొత్త షట్టర్ల కోసం అంచనాలు వేసి మంజూరు కోసం పంపించాం. మిగిన పనుల కోసం అంచనాలు వేశాం. అనుమతులు వస్తే ప్రారంభిస్తాం.

– జి.వెంకటరావు, జేఈ, వంశధార

91 శాతం వరి నాట్లు పూర్తి



దేవాది వద్ద వరి పొలాలు

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గ రైతులు ఈ ఖరీఫ్‌లో 91 శాతం మేర వరి నాట్లు పూర్తిచేశారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో వరి పండిస్తూ మంచి దిగుబడులను ఇక్కడి రైతులు సాధిస్తున్నారు. ఖరీఫ్ పనులు నెల క్రితమే ప్రారంభించారు. వర్షాలు అనుకూలించక పోవడం, కాలువల ద్వారా నీరు సక్రమంగా అందక పోవడంతో వరి నాట్లు ఆలస్యం అవుతుంది. మరోవైపు పెట్టుబడి సహాయం ప్రభుత్వం నుంచి అందకపోవడం కూడా మరో కారణమని రైతులు అంటున్నారు. వాస్తవానికి ఈ సరికే వరి నాట్లు పూర్తి కావాల్సి ఉంది. నరసన్నపేట మండలంలో దేవాది, మడపాం, బుచ్చిపేట, మాకివలస, ఉర్లాం తదితర గ్రామాల్లో వరి నాట్లు ఇంకా వేస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 30,608 హెక్టార్లలో సాగు సాధారణ విస్తీర్ణం కాగా.. 27733 హెక్టార్లలో పూర్తయింది. వెద పద్ధతిలో ఇప్పటికే 21462 హెక్టార్లలో వరి పంటను రైతులు వేశారు. మిగిలిన విస్తీర్ణంలో నారు పోసి ఉభాలు వేస్తున్నారు. చెరకు 416 హెక్టార్లలో, వేరుశనగ 28 హెక్టార్లలో వేశారు.

నియోజకవర్గంలో వరి పంట సాగు విస్తీర్ణం(హెక్టార్లు) వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం
నరసన్నపేట	7,061
పోలాకి	6,921
సారవకోట	6,116
జలుమూరు	7,635



మడపాం పంచాయతీ బుచ్చిపేట వద్ద పొలంలో నారు కట్టలు వేసిన రైతులు

రాఖీ సందడి



పాతపట్నం: రెడ్డి శాంతికి రాఖీ కుడుతున్న బ్రహ్మకుమారి



ఆమదాలవలస: రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



సారవకోట: బాలురుకు రాఖీలు కడుతున్న బాలికలు

ఆమదాలవలస: పట్టణంలో ఆదివారం రాఖీ పండగ సందడి నెలకొంది. రాఖీలు కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో దుకాణాలు కిటకిటలాడాయి. రాఖీలకు భలే గిరాకీ పెరిగింది. అన్నదమ్ములపై తమ అభిమానాన్ని చాటుకునేందుకు రకరకాల రాఖీలు కొనుగోలు చేశామని అక్కచెల్లిళ్లు ఆనందం వ్యక్తం చేశారు.

నైతిక విలువలు పెంపొందుతాయి..

పాతపట్నం: నైతిక విలువలను మరింత పెంపొందించేందుకు రక్షాబంధన్ ఎంతగానో ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రక్షా బంధన్ సందర్భంగా రెడ్డి శాంతికి బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు.

జేబీటీ పాఠశాలలో..

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో సోమవారం రక్షా బంధన్ పురస్కరించుకుని ఆదివారం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాఖీలు కట్టారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో సోదరభావం పెంపొందించేందుకు ఈ రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టినట్లు పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి: ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు తప్పులకు పాల్పడితే క్షమించేదిలేదని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్తకోట గ్రామంలో రక్షిత నీటి పథకం ఒక్కటే కావడం వల్ల పూర్తిస్థాయిలో తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ సురవరపు జగదీష్ తెచ్చారు. నూతనంగా రక్షిత పథకం మంజూరుచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎరువుల కోసం చెల్లించిన డబ్బులు సింధువాడ, పురుషోత్తపురం, కొండవలస అగ్రికల్చర్ అసిస్టెంట్లు వారి వద్ద ఉంచుకోవడం వల్ల ఎరువులు సక్రమంగా అందలేదని సభ దృష్టికి పలువురు సభ్యులు తీసుకువచ్చారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఎంఈఓ, ట్రాన్స్‌కో ఏఈ పనితీరుపై సభ్యుల ఫిర్యాదు మేరకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తురకపేట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు లేకుండా కేంద్రం నిర్వహిస్తున్నట్లు, తప్పుడు విధానంలో పలువురు పింఛన్లు పొందుతున్నారని మూలసవలాపురం సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఫిర్యాదు చేశారు. నకిలీ దివ్యాంగ ధ్రువపత్రాలు, ఆధార్ ట్యాంపరింగ్ వివరాలు తక్షణమే తనకు అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. డీలర్లకు ఇచ్చే సరకుల్లో భారీగా తరుగులు వస్తున్నాయని, ఎంఎల్ఎస్ పాయింట్ అధికారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి రమాదేవి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయ, జెడ్పీటీసీ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శివానందమూర్తి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పనిచేయడం ఇష్టంలేకపోతే వెళ్లిపోండి

ఉద్యోగం చేయడం ఇష్టంలేకపోతే ఇక్కడ నుంచి వెళ్లిపోండని ఆర్‌అండ్‌బీ అధికారులను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. సరుబుజ్జిలి జంక్షన్లో గుంతలు పూడ్చివేసిన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. గుంతలు మామూలు మట్టితో కప్పడం పట్ల అక్కడి నుంచే ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, డీఈలతో మాట్లాడి, అక్కడి పరిస్థితిని వీడియో కాల్ ద్వారా చూపించారు. నేను మీకు చెప్పిందేమిటి, మీరు చేసేదేమిటని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణ పట్ల బాధ్యత లేకపోతే వేరొక చోటికి వెళ్లిపోండని హెచ్చరించారు. ఇంత అధ్వానంగా గోతులు పూడ్చడమేమిటని ప్రశ్నించారు. తక్షణమే కొండ కంకర, క్రషర్ డస్ట్ తెచ్చి గోతులు పూడ్చకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుండపోత



కొత్తూరులో కురుస్తున్న భారీ వర్షం

కొత్తూరు: మండలంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. రోడ్లుపై వర్షం నీరు ప్రవహించింది. పంట పొలాలు వర్షం నీటితో నిండిపోయాయి. వరి నాట్లుకు, వెదలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడింది. కొత్తూరు మండలానికి అనుకుని ఉన్న సీతంపేట మండలంలోని కొండల్లో భారీ వర్షం కురడంతో పలు గెడ్డల్లో వరద నీరు వచ్చి చేరింది. పత్తి పంటకు ఈ వర్షం ప్రతి కూలంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దుర్గాప్రసాద్

పాతపట్నం: మండలంలోని సింగుపురం గ్రామంలో జీవామృతం తయారీపై ప్రకృతి వ్యసాయ మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్ ఆదివారం అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసిన మొదటి 15 రోజుల్లో ఐదు లీటర్ల జీవామృతాన్ని వంద లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నరసన్నపేట: పోలాకి మండలం రాళ్లగోదాయవలసకు చెందిన వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త నరసన్నపేట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పలాసలో డిగ్రీ చదువుతుంది. కళాశాలకు వెళ్తానని చెప్పి శుక్రవారం ఉదయం 10.30 సమయంలో నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్ ఎక్కి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల నుంచి వాకాబు చేసినా.. ఆచూకీ లభించలేదన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బూర్జ: మండలంలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి, జిల్లా అధ్యక్షుడు గురాడ అప్పన్న ఆధ్వర్యంలో ఆదివారం జంగాలపాడు పంచాయతీ అడ్డూరిపేట గ్రామంలో ఎన్నికలు జరిగాయి. మండల అధ్యక్షుడిగా సవర శోభన్, ఉపాధ్యక్షుడిగా సవర కృష్ణ, కార్యదర్శిగా బాడంగి సురేష్, సహాయ కార్యదర్శిగా సవర ధర్మారావు, కోశాధికారిగా సవర సింహాచలం, సహాయ కోశాధికారిగా సవర లక్ష్మణ్, మండల మహిళా అధ్యక్షురాలిగా కొండగొర్రి తేజవతి, మండల సలహాదారుడిగా సవర కుర్మయ్య, కార్యవర్గ సభ్యులుగా 20 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

కూలిన కల్వర్టు..



దన్నానపేట సమీపంలో కూలిన కల్వర్టు



రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గొయ్యి

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న కల్వర్టు కూలిపోయి రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడింది. ఈ రాహదారి గుండా ప్రయాణించే దన్నానపేట, సంతకొత్తవలస తదితర గ్రామాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును బాగు చేయాలని కోరుతున్నారు.